వేసవిలో నీటిఎద్దడి రాకుండా చూడండి

- మిషన్ భగీరథ శాఖ సమీక్షలో మంత్రి సీతక్క ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా వేసవికాలంలో తాగు నీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాబి.వృద్ధి, మిషన్ భగీరథ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. క్రమం తప్పకుండా సరఫరా జరిగేలా జాగ్రత్తలు అవసరమని సూచించారు. నిరంతర పర్య వేక్షణ చేయా లని అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎర్రంమంజిల ్లోని మిషన్ భగీరథ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్ల తో మంత్రి సీతక్క సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షించాలని, ప్రతి మారుమూల గ్రామానికి రోజువారీ నీటి సరఫరా జరిగేలా చూడాలని ఇంజినీర్లను కోరారు. అనంతరం మేడారం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరి ైనా ఉందన్నారు. త్వరలో మేడారం జాతరపై సంబంధిత శాఖలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. రిజర్వాయర్లు, నదుల తదితర తాగునీటి వనరుల స్థాయిలను నిరంతరం పర్య వేక్షించాలని సూచించా రు. రిజర్వాయం ్లలో నీటి మట్టాలు తగ్గినప్పుడల్లా ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లి, ఇరిగేషన్ అధికారు లతో సమన్వయం చేసుకుని సమస్యలు రాకుండా చెప్పారు. ఇందుకోసం ఎప్పటిక ప్పుడు ప్రత్యేక సమావేశాలు నిర్వహించా లని అన్నారు. భగీరథ ప్రాముఖ్యతపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందు కు ప్రచారం చేయాలని, ఇందుకోసం ఏర్పాట్లు చేయాలని సిఇలు, ఎస్‌ఇలకు సూచించారు. సమీక్ష దాదాపు మూడు గంటలపాటు జరిగింది. అంతకుముందు మిషన్ భగీరథ కార్యదర్శి స్మితా సభర్వాల్ మంత్రి సీతక్కకు భగీరథ ప్రాజెక్టు, నీటి సరఫరా తదితర అంశాలపై వివరంగా చెప్పారు. ఈ సంరద్భంగా మంత్రి సైతం తనకున్న సందేహాలను నివృత్తిచేసుకున్నా రు. ఈ సమీక్షా సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం కృపాకర్ రెడ్డి, సిఇలు విజయ్‌ప్రకాశ్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిఎన్ఐటిఎస్‌లో 'గణిత శాస్త్ర క్లబ్' పోటీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి సందర్భంగా జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిఎన్ఐటిఎస్)లోని గణిత శాస్త్ర క్లబ్ మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించింది. హైదరాబాద్‌లోని విద్యార్థులు.. వివిధ కళాశాలల నుంచి మొత్తం 109 బృందాలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాయి. దీన్ని 3 రౌండ్లలో నిర్వహించింది. రౌండ్-1 ఆన్‌లైన్, క్యాంపస్‌లో రౌండ్-2, రౌండ్-3 నిర్వహించారు. రౌండ్-3కి బిట్స్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ వి.హరగోపాల్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆయన 'టెక్చువల్ మోడలింగ్ ఎవల్యూషన్ ఆఫ్ మెయిన్ మన్‌కి బాత్ రిప్సోటరీ' మీద విశ్లేషణ ద్వారా ఒక అవగాహన కల్పించారని జిఎన్ఐటిఎస్ తెలిపింది. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ యొక్క ప్రస్తుత అనువర్తనాల్లో గణితం, గణాంకాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రమేష్‌రెడ్డి, హెచ్ఒడి డాక్టర్ ఎం.మాధవీలత, గణిత క్రమశిక్షణ సమన్వయకర్త డాక్టర్ ఎం అపర్ణ విజేతలను అభినందించి నగదు బహుమతులు అందజేశారు.

కాలయాపన లేకుండా మెగా డిఎస్‌సిని ప్రకటించాలి

- డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలయాపన లేకుండా మెగా డిఎస్‌సిని వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో ఆరు నెలల్లో మెగా డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ వెల్లడించారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్యం చేయకుండా గత ప్రభుత్వం జారీ చేసిన 5,089 ఉపాధ్యాయ పోస్టులకు అదనంగా కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల పేరుతో కాలయాపన చేయకుండా మెగా డిఎస్‌సి షెడ్యూల్‌ను విడుదల చేసి పరీక్షల తేదీలను ఖరారు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయ పదోన్నతులకు టెట్ నిర్వహిస్తే కాలయాపన అవుతుందని పేర్కొన్నారు. డిఎస్‌సి రాతపరీక్షలు నిర్వహించి నియామక ప్రక్రియ పూర్తి చేసేలోపు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు అవకాశముందని సూచించారు. 5,089 ఉపాధ్యాయ పోస్టులకు 1.77 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని తెలిపారు. మెగా డిఎస్‌సికి అనుబంధ నోటిఫికేషన్ ఇస్తే దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని వివరించారు. రాత పరీక్షలను ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని కోరారు.

నియంతృత్వం నుంచి విముక్తి

- ఇనుప కంచెలు తొలిగాయ్
- స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటున్న తెలంగాణ
- ఇది విస్పష్టమైన ప్రజాతీర్పు
- పౌరహక్కుల, ప్రజాస్వామ్య పాలనకు నాంది
- 48 గంటల్లోపే రెండు హామీలు అమలు
- ఆరునెలల్లో మెగా డిఎస్‌సి.. ఏడాది లోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ
- ఇంటి నిర్మాణాలకు పేదలకు రూ.ఐదు లక్షలు ఇస్తాం
- ఉభయసభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'పదేళ్ల నిర్బంధపు పాలన నుంచి విముక్తి కావాలని, తమ బతుకుల్లో గొప్ప మార్పు రావాలని కోరుకున్న తెలంగాణ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో విస్పష్టమైన తీర్పు ఇచ్చారు. వారి విజ్ఞతను నేను అభినందిస్తున్నాను. నా ప్రభుత్వంలో తెలంగాణ స్వేచ్ఛావాయువులను పీల్చు కుంటోంది. నియంతృత్వ పాలన, పోకడల నుంచి తెలంగాణ విముక్తి పొందింది. ప్రజాతీర్పు పౌరహక్కులకు, ప్రజాస్వామ్య పాలనకు నాంది అయ్యింది. పాలకులకు, ప్రజలకు మధ్య ఉన్న ఇనుప కంచెలు తొలగిపోయాయి. అడ్డుగోడలు, అద్దాల మేడలు పటాపంచలై ప్రజా ప్రభుత్వ ప్రస్థానం మొదలైందని చెప్పడానికి గర్విస్తున్నాను' అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. శాసనసభాపతి, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. 2023 తెలంగాణ ప్రస్థానంలో మంచి మార్పునకు శ్రీకారం చుట్టిన ఏడాదిగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. కొత్త ప్రభుత్వం..కొత్త సంవత్సరంలో రైతులు, యువత, మహిళలు, పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపుతుందనీ, ప్రజలకు స్వేచ్ఛ, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనకు శ్రీకారం చుడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు సేవకులే తప్ప పాలకులు కాదు..పెత్తందారులు అంతకంటే కాదని సుస్పష్టంగా చెప్పారు. సామాన్యుడూ ఇది తన ప్రభుత్వం అని చెప్పుకునే ప్రజాపాలన మొదలైందని, ఇది దేశానికే ఆదర్శంగా మారబోతున్నందు కు గర్వకారణంగా ఉందని అన్నారు. తెలంగాణ అమరవీరుల ఆశయాలు, విద్యార్థుల పోరాటాలు, పౌర సమాజపు ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన యుపిఎ ప్రభుత్వానికి, ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు, యుపిఎ చైర్మన్ సోనియాగాంధీకి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

గ్యారంటీల అమలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇచ్చిన హామీలు, చెప్పిన మాటకు కట్టుబడి వాటికి చట్టబద్ధత కల్పించే ఫైలుపై ఆయన సంతకం చేయడం ప్రభుత్వ సంకల్పానికి, చిత్తశుద్ధికి నిదర్శనమని గవర్నర్ ఈ సందర్భంగా కొనియాడారు. 48 గంటల్లోపే రెండు గ్యారెంటీలను అమలు చేయడం గొప్ప విషయమన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలో కార్యాచరణ

వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన, నిరంతర విద్యుత్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ చెప్పారు. రైతు డిక్లరేషన్‌లో ప్రకటించినట్టుగా ప్రతి పంటకూ మద్దతు ధర ఇస్తామని హామీనిచ్చారు. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని ప్రకటించారు. ప్రజలకు మాటిచ్చినట్టుగానే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణంలో జరిగిన నాణ్యతాలోపం, అవినీతి అవకతవకలపై విచారణ జరిపిస్తామని చెప్పారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా సాధన, దక్షిణ తెలంగాణ వరప్రదాయని అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేసి ఎగువనున్న ఆదిలాబాద్, ఇతర జిల్లాలకు సాగునీరందించాలనే లక్ష్యం తమ ప్రభుత్వం ముందుందని చెప్పారు. రైతు, ఎస్సీ,ఎస్టీ, యువ, బిసి డిక్లరేషన్ల హామీలకు అమలు చేస్తామని మాటిచ్చారు.

అసైన్డ్, పోడు భూముల పంపిణీ

ప్రజావాణిలో ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయనీ, ఈ నేపథ్యంలోనే ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తెచ్చి భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని గవర్నర్ హామీనిచ్చారు. ల్యాండ్ కమిషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములకు పరిరక్షించే కార్యక్రమాన్ని తీసుకుంటామని ప్రకటించారు. భూ సంస్కరణల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు పంచిన 25 లక్షల ఎకరాల భూమిపై పేదలకు పూర్తిస్థాయి భూ హక్కులు కల్పిస్తామని భరోసానిచ్చారు. అసైన్డ్, పోడు భూములకు పట్టాలిచ్చే కార్యాచరణను తీసుకుంటామని తెలిపారు.

యువతకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం

యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని గవర్నర్ తెలిపారు. ఆరునెలల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ విషయంలో ఇచ్చిన మాటప్రకారం ముందుకెళ్తామని చెప్పారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, స్థలమున్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టిందని గవర్నర్ తెలిపారు.ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు అదనంగా లక్ష రూపాయలిస్తామని వెల్లడించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను గుర్తించి 250 గజాల చొప్పున ఇంటిస్థలం, గౌరవభృతి ఇస్తామని ప్రకటించారు.

డ్రగ్స్ భూతాన్ని తరిమికొడతాం

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన విషయంలో అత్యంత కఠిన వైఖరి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ చెప్పారు. ఎంతటి ఒత్తిళ్లు వచ్చినా డ్రగ్స్ విషయంలో దోషులను వదిలేది లేదని స్పష్టం చేశారు.

తెలంగాణకు పాలనా కేంద్రంగా, ఆర్థికంగా గుండెకాయ లాంటి హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తెలిపారు. మూసీని ప్రక్షాళన చేస్తామన్నారు. ఆ నదీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పనా జోన్‌గా మార్చే కార్యాచరణ మొదలు పెట్టామని ప్రకటించారు.

ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడమే అతిపెద్ద సవాల్

అస్తవ్యస్తంగా మారిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడమే రాష్ట్ర ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాల్ అని గవర్నర్ అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో విద్యుత్ వ్యవస్థలు రూ.81,516 కోట్ల అప్పుల్లోకి కూరుకు పోయాయని చెప్పారు. రూ.50,275 కోట్ల మేర నష్టాల్లో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల కార్పొరేషన్‌లో రూ.56 వేల కోట్ల అప్పులు, నష్టాలు 11 వేల కోట్లకు చేరాయని వివరించారు. ప్రతి శాఖనూ అప్పుల కుప్పగా మార్చేశారనీ, కార్పొరేషన్ల పేరుతో విచ్చలవిడిగా రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులమయంగా చేశారని వాపోయారు. దుబారాను అరికట్టి ప్రజలపై భారం మోపకుండానే సంక్షేమ పాలన అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

తొమ్మిదిన్నరేండ్లలో వ్యవస్థల విధ్వంసం

రాష్ట్రంలో గడిచిన తొమ్మిదున్నరేండ్ల కాలంలో అన్ని వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయనీ, ప్రజాస్వామ్య యుతంగా పనిచేయాల్సిన వ్యవస్థలు, సంస్థలు వ్యక్తుల కోసం పనిచేసే స్థితికి దిగజారడంపై గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తి ఆరాధన కోసం వ్యవస్థలను దిగజార్చడం ప్రజాస్వామ్యానికి శోభనివ్వదన్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల్లో విలువను పునరుద్ధరిస్తామని భరోసానిచ్చారు. బేషజాలకు పోకుండా ప్రతిపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామనీ, అన్ని నియోజకవర్గాలకూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని ప్రకటించారు.

అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్ తమిళి సై

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- వెంటనే పోలీసు నియామకాలు
- సిఎం కాన్వాయ్‌తో ప్రజలకు ఇబ్బందులు రాకూడదు
- మాజీ డిఎస్‌పి నళినికి అదే పోస్టు ఇచ్చేందుకు అడ్డంకులేంటి...?
- ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్. బ్యూరో

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి రవిగుప్తా, ఆర్థిక శాఖ కార్యదర్శి శ్రీదేవి, ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ సచివాలయానికి వచ్చి ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి మంత్రుల పేషీల్లో నిర్దిష్టమైన సమయం, ప్రత్యేక అనుమతులు కల్పించేందుకు అధ్యయనం చేయాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రతినెల మొదటి వారంలో ఒకటి లేదా రెండు రోజులపాటు సభలు నిర్వహించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తే వారు హైదరాబాద్ దాకా వచ్చే అవసరం తగ్గుతుందని అన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సమయం నిర్దేశించుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య మంచి సత్సంబంధాలు ఏర్పడతాయని, సుహృద్భావ వాతావరణంలో ప్రభుత్వం పని చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విజ్ఞప్తులు, ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలనీ, ఎప్పటికప్పుడు స్టేటస్‌ను ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజావాణికి భారీ స్పందన వస్తున్నందున, అందుకనుగుణంగా ఫిర్యాదుల స్వీకరణకు టేబుళ్లు పెంచాలనీ, కనీస అవసరాలయిన మంచినీరు, ఇతర వసతులను కల్పించాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చుడాలని అన్నారు. శిక్షణలో ఉన్న ఐఎఎస్ అధికారుల సేవలను కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

పోలీసు ఉద్యోగ నియామకాలు వెంటనే చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. సిఎం కాన్వాయ్‌తో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ సాధన కోసం డిఎస్పి ఉద్యోగానికి రాజీనామా చేసిన నళినికి మళ్లీ ఆ ఉద్యోగం ఇవ్వడం ఎందుకు సాధ్యంకాదని సిఎం అధికారులను ప్రశ్నించారు. ఆమెకు ఉద్యోగం చేయాలని ఆశక్తిఉంటే తిరిగి సర్వీసులోకి తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు.

మహిళల బాధను విస్మరించిన స్మృతీ ఇరానీ

- కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల బాధను కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ విస్మరించారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు. వాస్తవిక సవాళ్ల పట్ల సానుభూతి చూపకవ ోవడం విస్తు గొల్పుతోందని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులపై కేంద్ర మంత్రి వైఖరిని ఆమె తప్పు పట్టారు. "నెలసరి ఎంపిక కాదు. అది సహజమైన జీవ ప్రక్రియ. వేతనంతో కూడిన సెలవును తిరస్కరించడం అసంఖ్యాకమైన మహిళలు అనుభవిస్తున్న బాధను విస్మరించినట్లే. విధానాల రూపకల్పనకు, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాల్సిన సమయం ఇది." అని కవిత తెలియజేశారు.

మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలి

భూమిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

- ఆయన్ను అరెస్టు చేసి, బాధితులకు న్యాయం చేయాలి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామ కూర మల్లారెడ్డి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న అసైన్డ్ భూమి సర్వే నెంబర్ 33, 34, 35లో గల 47 ఎకరాల 18 గుంటల ఎస్‌టిలకు చెందిన భూమిని మల్లారెడ్డి బెదిరించి తీసుకున్నట్టుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. దాంతో సిపిఎం నాయకులు శుక్రవారం ఆ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పి సత్యం మాట్లాడుతూ.. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మల్లారెడ్డి కుత్బుల్లాపూర్, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతపల్లి, ఘట్‌కేసర్ మండలాల్లో చాలా చోట్ల ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూము లను కబ్జా చేసినట్టు తెలిపారు. అసైన్డ్ భూములను కొనకూడదు.. అమ్మకూడదు అని చట్టం ఉన్నా కొన్నారని చెప్పారు. ప్రజలను ముంచి ప్రభుత్వ యంత్రాం గాన్ని మోసం చేసి రూ కోట్లు సంపాదించినట్టు అర్థమవుతుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన మల్లారెడ్డిని వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, పోలీస్ యంత్రాంగం ఇప్పటికైనా కదిలి ఆ భూము లపై సమగ్ర విచారణ జరిపి మల్లారెడ్డి ఆక్రమించు కున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతా మని హెచ్చరించారు. భూములను సందర్శించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఆర్ శ్రీరామ్ నాయక్, ఎం శోభన్ నాయక్, మేడ్చల్ జిల్లా నాయకులు జె చంద్రశేఖర్, ఎ అశోక్, ఎం శ్రీనివాస్ ఉన్నారు.

నలుగురు విప్‌ల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభకు రాష్ట్ర ప్రభుత్వం నలుగురు విప్‌లను నియమించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అండ్లూరి లక్ష్మణ్‌కుమార్ (ధర్మపురి), జాటోత్ రామచంద్రు నాయక్ (డోర్నకల్), ఆది శ్రీనివాస్ (వేములవాడ), బీర్ల ఐలయ్య (ఆలేరు)లను నియమించింది. చీఫ్‌విప్‌ను మాత్రం నియమించలేదు. ఆ పదవికి సంబంధించిన ఉత్తర్వులు శనివారం వెలువడే అవకాశం ఉంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు చీఫ్‌విప్‌గా నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు సమాచారం.

రోడ్డు ధర్నా చేస్తున్న రైతులు

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపేయాలి

- ధర్నాకు దిగిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఆపే వరకు తమ పోరాటం ఆగదని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు, రైతులు తీర్మానించారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంట పొలాల్లో ఓ ప్రయివేటు సంస్థ ఏర్పాటు చేయబోయే ఇథనాల్ ఫ్యాక్టరీతో ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల భూముల రైతుల అభిప్రాయ సేకరణ చేయకుండా ఫ్యాక్టరీ పనులను మొదలుపెట్టారని శుక్రవారం పోచమ్మ ఆలయం వద్ద రైతులు సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించారు. అనంతరం రైతులు, నాయకులు, గ్రామ ప్రజలు బస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేశారు. ఫ్యాక్టరీ పనులు ఆపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపనతో చుట్టుపక్కల దిలావర్‌పూర్, గుండంపల్లి తదితర గ్రామాల పంటలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని స్థాపిస్తే అనేక ఇబ్బందులకు గురవుతామన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే పొగ నుంచి వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థపు నీరు గోదావరి నదిలో కలవడంతో నీరు కలుషితమై జీవరాశి మనుగడకు ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు నెలల కింద ధర్నా, ఆందోళన చేయడంతో నిలిపివేసిన ఫ్యాక్టరీ పనులు, అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ ప్రారంభించా రని రైతులు తెలిపారు. ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఆయా గ్రామాల ప్రజలు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఉద్యమానికి సిద్ధమయ్యా రు. దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నాయకులు, రైతులు, యువ కులు 66వ జాతీయ రహదారి దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద రాస్తారోకో చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని రోడ్డుపై కూర్చున్నారు. పోలీసు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్న దిలావర్‌పూర్ ఎస్ఐ యాసిర్ అరాఫత్, నర్సాపూర్ (జి) ఎస్ఐ రవీందర్ రైతులకు నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమించారు. ఇకనైనా ప్రభుత్వం కల్పించుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపి ివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వివిధ రూపాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎంపిపి పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ విరేష్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయండి

- మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి
- మంత్రి సీతక్కకు సిఐటియు వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ, బీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతిరెడ్డి, మహిళా కన్వీనర్ పి.యాదమ్మ, రాష్ట్ర కార్యదర్శులు పి.సుధాకర్, తునికి మహేష్, మల్లేష్, అంజయ్య, పులి మల్లేష్, మండ్ల రాజు, వెంకటేష్ గౌడ్, నర్సమ్మ, ఆశయ్య, శ్రీకాంత్, రామకృష్ణ, వి.వి.నర్సింహా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. దీనివల్ల 12,769 పంచాయతీల్లో పనిచేస్తున్న 52 వేలకుపైగా ఉన్న పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కారోబార్, బిల్ కలెక్టర్లు, గుమస్తాలను సహాయ కార్యదర్శులుగా నియమిస్తామనే హామీల అమలుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, సిబ్బందికి జీఓ నెం.60 ప్రకారం వేతనాలు పెంచినట్టుగానే జీపీ కార్మికులకు కూడా వేతనాలు పెంచాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి పాత కేటగిరీలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్త సర్కార్‌తో... చిగురిస్తున్న ఆశలు

ప్రజాభవన్ ముందు బారులు తీరిన జనం

- ప్రజావాణికిబారులు తీరిన జనం
- పంజాగుట్ట నుంచి ప్రజాభవన్ వరకు
- అరకిలోమీటర్‌కు పైగా క్యూలైన్
- సమస్యలు ఏకరువుపెట్టిన ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలు చెప్పుకునేందుకు భారీగా ప్రజలు తరలి వచ్చారు. ఉదయం ఐదు గంటల నుంచే బాధితులు తమ గోడు వెళ్లబోసుకునేందుకు గేటు ముందు పడిగాపులు కాశారు. పంజాగుట్ట చౌరస్తా నుంచి ప్రజాభవన్ వరకు అర కిలోమీటర్ వరకు క్యూలైన్ సాగింది. ఏండ్లుగా పరిష్కారం కాని తమ సమస్యలు కొత్త ప్రభుత్వంలోనైనా ఓ కొలిక్కి వస్తాయనే ఆశ అందరిలో కనిపించింది. ఈ కార్యక్ర ామానికి వినతులు వెల్లువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సమస్య లను చెప్పుకున్నారు. ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, భూ సమస్యలు ఎక్కువగా కనిపించాయి. వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలు, నిరు పేదలు, రైతులు, నిరుద్యోగులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే అర్జీలు తీసుకుంటుండటంతో వేకువజాము నుంచే ప్రజాభవన్ గేటు ముందు జనం బారులు తీరారు. ప్రజల నుంచి వస్తున్న వినతుల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, ఆయుష్ శాఖ కమీషనర్ హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌లు ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి వచ్చిన వారి సమస్యను తెలుసుకుని సంబంధిత శాఖలకు సిఫారసు చేశారు. ప్రతి అర్జీకి ఒక నంబర్‌ను కేటాయించారు. అర్జీదారుల రిఫరెన్స్ కొరకు వారి సెల్‌ఫోన్ నంబర్‌కు సంక్షిప్త సందేశం పంపుతున్నారు. గత పదేండ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పని కాని పరిస్థితి నెలకొంది. ముఖ్యమంత్రి కలవరు... మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో లేదని తప్పించుకున్న సందర్భాలు కోకొల్లలు. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలతో సత్సంబంధాలు నెరపడంలో విఫలమైందనే విమర్శలను మూటగట్టుకుంది. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా సర్కార్ ప్రజావాణిని ఏర్పాటు చేసింది. గత 10 రోజులుగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. కొత్త సర్కార్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జనం నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

- ప్రజావాణిలో వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ భూమిలో గుడిసేలుసుకున్న పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా భిక్నూర్ మండలం జంగంపల్లి గ్రామంలోని 985, 990,991 సర్వే నంబర్‌లో గుడిసెలేసుకున్న పేదలు ఇళ్ల పట్టాలివ్వాలని విజ్ఞాపన పత్రం అందజేశారని తెలిపారు. అక్కడ కొన్ని ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం పోరాటం జరుగుతున్నదని పేర్కొన్నారు. పట్టాలతోపాటు గృహనిర్మాణం కోసం రూ. ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ బి పద్మ, రాష్ట్ర నాయకులు కొత్త నర్సింములుతోపాటు 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మెడికోల విధుల బహిష్కరణ

- డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు కళాశాలలోకి చొరబడి మెడికోలపై దాడి చేయడంపై నిరసన కొనసాగుతోంది. శుక్రవారం వారు విధులను బహిష్కరించారు. ఈ ఘటనకు కారణమైన రిమ్స్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ విద్యార్థులు డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఛాంబర్ ఎదుట నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. అనంతరం సాయంత్రం సమయంలోనూ రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలిపారు. డైరెక్టర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మెడికోలపై జరిగిన దాడి ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు డిఎంఇ ఆదేశాలతో విచారణ కమిటీ రిమ్స్‌కు వచ్చింది. శుక్రవారం ఉదయం కమిటీ సభ్యులు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తోపాటు మెడికోలు, ప్రొఫెసర్లు, వైద్యులతో విడివిడిగా విచారణ జరిపింది. నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు శివప్రసాద్, వివి రావ్ నివేదికను సిద్ధం చేసి త్వరలో డిఎంఇకి అందించనున్నారు. ఇదిలా ఉంటే, మెడికోలు మాత్రం ఘటనకు సంబంధించి విషయాలు కాకుండా ఇతర విషయాలు అడిగారని ఆరోపిస్తున్నారు. పారదర్శకంగా విచారణ జరగడం లేదని విమర్శించారు.

దక్షిణ డిస్కం సిఎండిగా ముషారఫ్ ఫరూఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం జి.రఘుమారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఐఐటి మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన ముషారఫ్ ఫరూఖీ 2014లో ఐఎఎస్‌కు ఎంపికయ్యారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్‌గా, నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా, ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో డైరెక్టర్‌గా పని చేశారు. సిఎండిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన సంస్థ డైరెక్టర్లతో విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, మదన్ మోహన్‌రావు, పర్వతం, స్వామి రెడ్డి, గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం

- లోపాలను సమీక్షించి పార్టీని పటిష్టం చేస్తాం
- సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు
- గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేయాలి
- ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి
- బిజెపి ఓట్లు, సీట్లు రెట్టింపు కావడం ప్రమాదకర సంకేతం
- అహంభావం, అప్రజాస్వామిక ధోరణుల వల్లే బిఆర్ఎస్ ఓటమి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే కాలంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తామని, తమ పార్టీ ఆ బాధ్యతను నిర్వర్తిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రివర్గానికి శుభాకాంక్షలు చెప్పారు. ఈ నెల 12,13,14 తేదీల్లో మూడ్రోజుల పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర పరిశీలకులుగా ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్ హాజరయ్యారు. శుక్రవారం తనను కలిసిన విలేకర్లతో తమ్మినేని మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు, పార్టీ అనుసరించిన ఎత్తుగడలు, ఫలితాలపై సమీక్షించామని చెప్పారు. తమ ఎత్తుగడలు సంతృప్తికరంగానే ఉన్నాయని అన్నారు. పోటీచేసిన 19 స్థానాల్లో గెలుస్తామని భావించకపోయినా ఓట్లు తక్కువ రావడం ప్రధాన లోపంగా పార్టీ గుర్తించిందని వివరించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు నిర్ణయం కాలయాపన కావడం, చివరి నిమిషంలో పొత్తు సాధ్యం కాదని తేలాక ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని చెప్పారు. సన్నద్ధం కావడానికి సమయం సరిపోని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయని వివరించారు. బిఆర్ఎస్ మీద కోపం ఉన్న వారు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ మీద వ్యతిరేకత ఉన్న వారు బీఆర్ఎస్‌కు ఓటేశారని చెప్పారు. సిపిఎం పట్ల అభిమానం ఉన్న వారూ తమకు ఓటేయలేదని అన్నారు. సిపిఎం కుటుంబాలే ఓటేశాయి తప్ప సంప్రదాయంగా వేసే అభిమానులు ఈసారి ఓటేయలేదని వివరించారు. పార్టీ కమిటీలు, శాఖల్లోనూ గణనీయంగా లోపాలు జరిగాయని అన్నారు. ఈ లోపాలను సమీక్షించుకుని భవిష్యత్తులో పార్టీని పటిష్టం చేయడానికి అవసరమైన నిర్ణయాలు చేశామని చెప్పారు.

బిఆర్ఎస్‌ను ఓడించాలనుకున్న ప్రజలు

రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని, వివిధ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దామని చెప్తూ బిఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లిందని తమ్మినేని అన్నారు. అయితే అభివృద్ధి కంటే ఈ పదేండ్ల కాలంలో వారి అహంభావం, అప్రజాస్వామిక ధోరణులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బిఆర్ఎస్‌ను ఓడించాలని భావించారని అన్నారు. బిఆర్ఎస్‌పై వ్యతిరేకత కాంగ్రెస్‌కు దోహదపడిందన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర, రేవంత్‌రెడ్డి నాయకత్వం, కర్ణాటకలో విజయం, అధిష్టానం చొరవ, కాంగ్రెస్‌లో గ్రూపులన్నీ ఏకం కావడం వంటి పరిణామాలన్నీ కాంగ్రెస్ గెలుపునకు తోడ్పడ్డాయని వివరించారు.

బిజెపి గెలుపుపై లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలి

మనుగోడు ఎన్నికల ముందు ప్రదర్శించిన జోరు ఆ ఫలితాల తర్వాత బిజెపిలో కనిపించలేదని తమ్మినేని అన్నారు. గత ఎన్నికలతో పోల్చితే బిజెపికి ఓట్లు, సీట్లు రెట్టింపయ్యాయని, ఇది ఓ ప్రమాదకర సంకేతమని చెప్పారు. రాష్ట్రంలో మతోన్మాద శక్తులు బలపడడానికి ఇది సంకేతంగా ఉందన్నారు. లౌకికశక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే కాలంలో తమ పార్టీ ఆ దిశగా చొరవ చూపుతుందని అన్నారు.

2 గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి వారంలోనే రెండు గ్యారంటీలను అమలు చేయడం శుభపరిణామమని తమ్మినేని చెప్పారు. వివిధ శాఖలపై సమీక్షలు, లోపాలను గుర్తించడం, వాటిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించడం సానుకూల సంకేతమని అన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి చేసిన వాగ్దానాలను అమలు జరపాలని కోరారు. ప్రజాస్వామికంగా పాలన అందించాలని సూచించారు. అలా జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు గాయం కావడం, తుంటి ఎముక విరగడం, ఆస్పత్రిలో చేరడం, ఆపరేషన్ జరగడం బాధాకరమని తమ్మినేని అన్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఇటీవల సంభవించిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని తమ్మినేని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని ఆదుకునే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని కోరారు. వాయిదా పడిన పోటీ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, గ్రామీణ పేదల విషయంలో కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పోడు భూముల పట్టాలను పంపిణీ చేయాలని అన్నారు.

ఈ ఎన్నికల్లో పార్టీ కోసం రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తమ్మినేని ధన్యవాదాలు చెప్పారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంపిణీ చేస్తున్న ఈ తరుణంలోనూ పార్టీని ఆదరించి ఓటేసిన ప్రజలకు తమ్మినేని కృతజ్ఞతలు ప్రకటించారు.

మీడియాతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారు

- బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేసిన ప్రసంగంలో కొత్తదనం కనిపించలేదని.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి స్పష్టత ఇవ్వలేదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గవర్నర్ ప్రసంగం చూస్తే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను చదివినట్లు ఉందని విమర్శించారు. గవర్నర్ చేత అబద్దాలు చదివించారని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, తదితరులతో కలిసి కడియం మాట్లాడారు. గత పదేళ్లలో రాష్ట్రం తిరోగమనంలో ఉందని గవర్నర్ ప్రసంగంలో అవాస్తవాలు చెప్పారన్నారు. రాష్ట్రంలో పంటల దిగుబడి, విస్తీర్ణం పెరిగింది నిజం కాదా? వరి ధాన్యం ఉత్పత్తి, 24 గంటల విద్యుత్ అందించింది నిజం కాదా? జాతీయ స్థాయిలో తెలంగాణ అనేక అవార్డులు సొంతం చేసుకుందని గతంలో చెప్పిన గవర్నర్...ఈ అంశాలన్నింటినీ మర్చిపోయినట్లున్నారని పేర్కొన్నారు. అబద్ధాలు చెప్పడం గవర్నర్ పదవిని అవమానించినట్లే అవుతుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని రైతులు, ప్రజలు రోడ్డెక్కిన పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. ప్రభుత్వం శ్వేతపత్రాలు ప్రకటించిన తరువాత అన్ని అంశాలపై మాట్లాడుతామని కడియం వెల్లడించారు.

డిప్యూటీ సిఎంకు ఆకృతి శుభాభినందనలు

ప్రజాశక్తి - కల్చరల్

శుక్ర వారం రోజు, డెప్యూటీ సిఎంగా పదవీ స్వీకారం చేసిన సందర్భంగా జంట నగరాల్లోనీ ప్రముఖ టీవీ ఇన్ సాంస్కృతిక సంస్థ ఆకృతి అధ్యక్షుడు సుధాకర్, డెప్యూటీ సిఎం అధికారిక నివాసంలో మల్లు భట్టి విక్రమార్కను కలసి శుభాభిందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో, జ్ఞాపికతో సుధాకర్ సత్కరించారు.. సాంస్కృతిక కార్యక్రమాల సరళిని ఆయన అడిగి తెలుసుకున్నారు.. సాహితీ, సాంస్కృతక పరంగా తెలంగాణ రాష్ట్రం పరిడవిల్లాలని ఆయన ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో కళాకారుడు మోహనకృష్ణతో పాటు పలువురు ఆకృతి సభ్యులు డెప్యూటీ సిఎంకు అభినందనలు తెలిపారు..

కుత్బుల్లాపూర్ జడ్‌పి స్కూల్‌కు ఎంఆర్ఐటిఎస్ విద్యార్థుల బృందం వితరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు ఎంఆర్ఐటిఎస్ కాలేజీ స్ట్రీట్ కాజ్ విద్యార్థుల బృందం డిజిటల్ క్లాస్ కిట్ వితరణ చేసింది. ఆ పాఠశాలలో డిజిటల్ తరగతులకు అవకాశం లేదని తెలుసుకున్న ఎంఆర్ఐటిఎస్ కళాశాల విద్యార్థులు వెంటనే స్పందించారు. పాఠశాలకు వచ్చి అక్కడి పరిస్థితులు గమనించి రూ. 60వేలతో ప్రొజెక్టర్ , కీబోర్డ్ , మౌస్, స్క్రీన్, మానిటర్ తెచ్చి ఒక డిజిటల్ తరగతి ఏర్పాటు చేశారు . తద్వారా 1200 పైచిలుకు విద్యార్థులకి ఈ డిజిటల్ తరగతి ఉపయోగపడనుంది. పేద విద్యార్థులు చదివే పాఠశాలలో వసతులు కల్పించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు .

సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కుర్చీలో కూర్చున్న మోహన్ సాయి

సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడేళ్ల బాలుడు

- కేన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కోరిక తీర్చిన మేక్ ఎ విష్ ఫౌండేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేన్సర్‌తో బాధపడుతున్న ఏడేళ్ల బాలుడి పోలీసు కావాలనే కోరికను మేకే ఏ విష్ ఫౌండేషన్, బంజారాహిల్స్ పోలీసులు తీర్చారు. వివరాల్లోకెళ్తే.. ఎపిలోని గుంటూరుకు చెందిన అనుపోజు బ్రహ్మం-లక్ష్మి దంపతుల రెండో కుమారుడు మోహన్ సాయి 4వ తరగతి పూర్తి చేశాడు. గతేడాది సెలవుల్లో అతను అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య పరీక్షలు చేయించగా అతనికి క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారు. సంవత్సర కాలంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు. అయితే బాలుడికి పోలీసు అధికారి కావాలన్న కోరిక ఉందని తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న ఆస్పత్రి సిబ్బంది.. మేక్ ఏ విష ఫౌండేషన్ సభ్యులకు చెప్పారు. వారు బాలున్ని శుక్రవారం బంజారాహిల్స్ పోలిస్ స్టేషన్‌కు తీసుకొచ్చి అక్కడి అధికారులకు విషయాన్ని చెప్పారు. దాంతో అక్కడి సిబ్బంది పోలీస్ డ్రెస్‌లో ఉన్న మోహన్‌సాయిని సాదరంగా ఆహ్వానించి సబ్ ఇన్‌స్పెక్టర్ కుర్చీలో కూర్చోబెట్టారు. బంజారాహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జాకీర్ హుస్సేన్ చిన్నారికి పోలీసు గౌరవ వందనం చేసి, చిన్నారి నుంచీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అడ్మిన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివ శంకర్ చిన్నారికి పోలీస్ స్టేషన్‌లో జరిగే పని విధానం గురించి వివరించారు. అలాగే సబ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఇతర సిబ్బంది బహుమతులను అందజేశారు. బంజారాహిల్స్ పోలీసులు అతని కోరిక నెరవేర్చడంతో బాలుడు ఆనందం వ్యక్తం చేశాడు. తన కోరికలు నెరవేర్చుకోవడానికి అహర్నిశలూ కృషి చేస్తానని తెలిపాడు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఫార్మాసిటీ రద్దుకు సిఎం నిర్ణయం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మాసిటీ రద్దుకు సిఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ మాట వింటేనే రంగారెడ్డి ప్రజలంతా మా బతుకులు ఏమైతాయో అని బాధపడ్డారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షులుగా ఉన్నప్పుడే అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామంటూ ప్రకటించారనీ, ఆ హామీని నెరవేరుస్తారని తెలిపారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- సిఎం రేవంత్‌రెడ్డికి పిఎంటిఎటిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ప్రొగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పిఎంటిఎటిఎస్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూళ్ల స్థానంలో మోడల్ స్కూళ్లను అభివృద్ధి చేయాలని కోరారు. అదనపు మండలాల్లో నూతనంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పదేండ్లుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల్లేవని తెలిపారు. వేతనాల కోసం ప్రతినెలా ఎదురుచూడాల్సి వస్తున్నదనీ, 010 పద్దు కింద జీతాలివ్వాలని పేర్కొన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్, హెల్త్ కార్డులు వర్తింపచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై సిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ ఎన్‌పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కర్నాటి వరుణ్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం ఎన్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కంపెనీ డైరెక్టర్లు బి వెంకటేశ్వరరావు, పి గణపతి, పి సంధ్యారాణి, వి తిరుపతిరెడ్డి, ఛీఫ్ విజిలెన్స్ అధికారి బి జనార్ధన్, సిజిఎంలు బి అశోక్‌కుమార్, టి సదర్‌లాల్, టి మధుసూదన్, వి మోహన్‌రావు, కె కిషన్, రాజు చౌహాన్, కెఎన్ గుట్ట, ప్రభాకర్ అశోక్, బీకంసింగ్, రవీంద్రనాథ్, అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సిఎండి కె వరుణ్‌రెడ్డి.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సిపి, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిఎండికి పూలమొక్కనిచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డిని సిపి అభినందించారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని ఉపాధ్యాయుడు మృతి

- మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు
- పాఠశాలకు వెళ్తుండగా ప్రమాదం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇద్దరు ఉపాధ్యాయులు బైక్‌పై పాఠశాలకు వెళ్తుండగా.. ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం తాలెల్మ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగింది.

ప్రత్యక్ష సాక్ష్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన పిట్ల రాజ్‌కుమార్ (38), సంగారెడ్డి పట్టణానికి చెందిన సందీప్ కుమార్.. తాలెల్మాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం ఉదయం ఇద్దరు కలిసి ఒకే బైక్‌పై పాఠశాలకు బయలుదేరారు. ఈ క్రమంలో తలెల్మా సమీపంలోని ప్రధాన రహదారి మూలమలుపు వద్ద వట్‌పల్లి నుంచి జోగిపేట వైపు వస్తున్న సంగారెడ్డి డిపో ఆర్‌టిసి బస్సు.. వారి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో బైక్ నడుపుతున్న రాజ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. వెనకాల కూర్చున్న సందీప్ కుమార్‌కు కాలు విరిగింది. ఆయన్ను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ.. అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ఉన్న ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఆయా టీచర్స్ యూనియన్ నాయకులు, సహా ఉపాధ్యాయులు జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

బస్సు ముందు రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

బస్సులు కిక్కిరుస్తున్నయ్..

- అదనంగా సర్వీసు నడపండి
- సాలూరలో విద్యార్థుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో అదనంగా సాలూర మండల కేంద్రం వరకు స్పెషల్ బస్సులను నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై విద్యార్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం వేళ బోధన్ నుండి వచ్చే బస్సు సుంకిని గ్రామం వరకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బస్సు రద్దీగా ఉంటుందన్నారు. దాంతో తమకు కనీసం నిలబడి ప్రయాణించే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సాయంత్రం వేళా బస్సు రద్దీగా మారడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని వాపోయారు. కావున బోధన్ డిపో మేనేజర్ తక్షణమే స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం స్పెషల్ బస్సు వేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు.

ప్రభుత్వం మారినా.. ఆగని అక్రమార్కులు

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా ఇసుక రవాణా
- అక్రమ రవాణాలో అధికారుల పాత్ర ఎంత..?
- ప్రతి నెలా జిల్లా నుంచి రూ.180 కోట్ల ఇసుక తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రాజధానికి ఇసుక కావాలంటే ప్రధానంగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వెళ్లాల్సిందే. ప్రతిరోజూ వందల కొద్ది లారీల్లో వే బిల్లు పేరు చెప్పి గత ప్రభుత్వంలో ఇసుక రవాణా అక్రమంగా నిరాటంకంగా సాగేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుక అక్రమ రవాణా ఆగిపోతుందని చర్చ జరిగింది. కానీ ఏమాత్రం ఆగలేదు. అంటే ఏ ప్రభుత్వం ఉన్నా అక్రమార్కులు ప్రభుత్వాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అక్రమ వ్యాపారం జరుపుతారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ వ్యాపారానికి ఎలా సహకరించారో ఈ ప్రభుత్వంలోనూ అధికారులు అలాగే సహకరిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి.

ఇసుక లారీ ఆపితే ఫోన్లు..

ఇసుక అక్రమ రవాణా ఎందుకు ఆపడం లేదని ఓ అధికారితో మాట్లాడగా ఆయన మనసులో మాట చెప్పారు. ఇసుక లారీని ఆపితే.. వెంటనే నాయకుల నుంచి ఫోన్లు.. ఒకవేళ తప్పనిసరి కేసులు నమోదు చేస్తే బెదిరింపులు.. హెచ్చరికలు.. తప్పవంటూ ఆ అధికారి తన బాధను వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణా నివారణకు శాఖల మధ్య కూడా సమన్వయం లేదనేది స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లాలోని పలుచోట్ల మానేరు వాగు నుంచి నిత్యం నాణ్యమైన ఇసుకను సిద్ధిపేటతోపాటు హైదరాబాద్, కామారెడ్డికి లారీల్లో అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం. ప్రతిరోజూ జిల్లాలో రూ.60లక్షల విలువగల ఇసుక రవాణా జరుగుతోంది. అంటే నెలకు రూ.180కోట్ల విలువ గల ఇసుక రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి తరలిపోతున్నా అధికారులు కిక్కురుమనడం లేదు.

ఇసుక రవాణాలో ప్రజాప్రతినిధి తండ్రి..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ ప్రజా ప్రతినిధి తండ్రి ఇసుక అక్రమార్కుడిగా వెలుగుతున్నారు. ఆయన ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని తెలిసింది. ఆయనతోపాటు కరీంనగర్ ప్రాంతానికి చెందిన ఓ పోలీస్ అధికారి భాగస్వామ్యమూ ఇసుక అక్రమ రవాణాలో ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన అనేక అక్రమాలు చేసినా గత ప్రభుత్వం ఉత్తమ పోలీస్ అధికారిగా గుర్తించడం గమనార్హం. ప్రస్తుతం ఆయన వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఇక ప్రజాప్రతినిధి తండ్రి జిల్లాలో చెప్పిందే వేదం.. లేదంటే కుమారుడి నుంచి ఫోన్ వస్తుంది. ఇదంతా ఎందుకన్నట్టు అధికారులు కూడా ఆయనకు అనుకూలంగా పని చేస్తున్నట్టు సమాచారం. సరే ఇదంతా గత ప్రభుత్వంలో జరిగింది. అనుకుంటే ఈ ప్రభుత్వంలోనూ ఆయన అక్రమ రవాణాకు హద్దే లేకుండా పోయింది. దీనికి అధికారులూ సహకరిస్తున్నట్టు తెలిసింది.

భూగర్భ జలాలపై ప్రభావం..

ఇసుకను ఇష్టారాజ్యంగా తరలించడంతో వాగుల్లో నీటి నిలువ సామర్థ్యం తగ్గుతోంది. భూగర్భ జలాలు అడుగంటి తాగు సాగు నీటి లభ్యతకు కష్టాలు తప్పడం లేదు. పలువురి రైతుల బోర్లు ఎండిపోగా ట్యాంకర్లతో నీటిని తరలించి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో భూగర్భ జలాలు గతంలో కంటే చాలా లోతుకు వెళ్లడంతో నీటి లభ్యత తక్కువ అయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నిరోధించి భూగర్భ జలాలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.